

పోటెత్తిన భక్తజనం

చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. - 6లో



కాంగ్రెస్‌దే అధికారం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని సినీ నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. యాతవాకిల్ల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. - 6లో



బీసీల్లో ఐక్యత లేకనే..

బీసీల్లో ఐక్యత లేకనే ఇన్ని రోజులు వెనుకబడిపోయామని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. - 6లో

న్యూస్‌రీల్

పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఓటర్లు 5,106 మంది, ఇతర జిల్లా ఓటర్లు 1,992 మంది మొత్తం 7,098 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో 7,044 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందిలో జిల్లాకు చెందిన 806 మందితో పాటు ఇతర జిల్లాలకు చెందిన 1952 మంది, మొత్తం 2758 పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా 2,737 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో డ్రైవర్స్, కండక్టర్, క్లీనర్స్ మరో 11 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 9,732 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని తెలిపారు.

బీసీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న తన్నీరు రాంప్రభు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ తోపాటు, ఇతర పార్టీల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. సోమవారం తిరుమలగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ 24, కాంగ్రెస్ 23, బీజేపీ 35లతో పాటు మిగిలిన పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించకుండా అవమాన పరిచాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీ అభ్యర్థులను పార్టీల కతీతంగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎల్సోజు చంటి, మహేష్ గౌడ్, లక్ష్మయ్య, రామ్మూర్తి, లింగయ్య, అశోక్, తరుణ్, గణేష్, ఉపేందర్, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి



మాట్లాడుతున్న పశ్య పద్మ

హుజూర్‌నగర్: అధికారంలో ఉండి విభజన హామీలు నెరవేర్చలేని బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. రెండు దఫాలుగా అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్, బీజేపీలు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పట్టణంలోని వంగవీటి హనుమంతరావు, గిరిబాబు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల ఉమా, యల్లావుల సీత, గూడెపు మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఐటీ ఉద్యోగులు

- మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ

సూర్యాపేట: మంత్రి జగదీష్ రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయనకు మద్దతుగా ఐటీ ఉద్యోగులు సోమవారం సూర్యాపేటలో 'వి ఆర్ విత్ జగదీష్ అన్న' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన జగదీష్‌రెడ్డి తోనే సాధ్యమన్నారు. ఐటీ కొలువులు మూడు వేలమందికి విస్తరించాలంటే జగదీష్‌రెడ్డే మళ్లీ గెలవాలని తెలిపారు.



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐటీ ఉద్యోగులు


గెలుపు దక్కేదెవరికి?

కొన్ని చోట్ల నువ్వా నేనా.. మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు గడువు దగ్గరపడింది. 30న ఉదయం నుంచే పోలింగ్ జరగనుండగా.. అభ్యర్థుల పోల్ మేనేజ్‌మెంట్‌కు సమయం రెండు రోజులు ఉంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. 29వ తేదీన కూడా సభలు సమావేశాలు మినహా ఇంటింటి ప్రచారం చేసుకునే వీలు ఉంది. అయితే ఇప్పటివరకు నిర్వహించిన ప్రచారం ఆధారంగా ఇంకా తాము ఏయే పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో బలహీనంగా ఉన్నామో తెలుసుకొని పార్టీ శ్రేణులను రంగంలోకి దింపాయి. కొన్ని చోట్ల నువ్వా నేనా అన్నట్లుగా, మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ ఉంది.

–సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- పోల్ మేనేజ్‌మెంట్‌కు రెండు రోజులే గడువు
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు
- పార్టీ శ్రేణులు ప్రతీ ఓటరును కలిసేలా ప్రణాళిక



నల్లగొండ జిల్లాలో మూడింట సై అంటే సై

- నల్లగొండ నియోజకవర్గంలో ఇద్దరి మధ్యే పోటీ నెలకొంది. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులైన కంచర్ల భూపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్యే కీలక పోరు సాగుతోంది. బీజేపీ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ నుంచి పిల్లి రామరాజుయాదవ్ బరిలో ఉన్నారు. ఇక్కడ బీజేపీ సంప్రదాయ ఓట్లు బీజేపీకే పడనుండగా, ఆయన అదనంగా ఏ మేరకు ఓట్లను సాధిస్తారన్నది పోలింగ్ రోజే తేలనుంది. మరోవైపు పిల్లి రామరాజుయాదవ్ యాదవ సామాజికవర్గంతోపాటు బీసీల ఓట్లు తనకు పడేలా ప్రయత్నిస్తున్నారు. ఈయన చీల్చే ఓట్లు.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రధానం కానున్నాయి.
- నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం మధ్య హోరాహోరీగా పోటీ సాగుతోంది. ఇక్కడ చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి ధీమాగా ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న జోష్, మాజీ ఎమ్మెల్యేగా తనకున్న వ్యక్తిగత అనుచర వర్గ బలంతో గెలుపు సాధిస్తానన్న ధీమాతో కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నారు.
- నాగార్జునసాగర్‌లోనూ ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కేడర్, తన తండ్రి జానారెడ్డి చరిష్మా తనను కచ్చితంగా గెలిపిస్తుందన్న ధీమాలో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ నియోజవర్గ అభివృద్ధికి తాను తీసుకుకొచ్చిన నిధులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ బీజేపీ, ఇతర పార్టీలు భారీ ప్రభావం చూపుతాయన్న అంచనాలు లేవు.

మిర్యాలగూడ, మునుగోడు, దేవరకొండలో ట్రయాంగిల్

- మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వ్యక్తిగతంగా తమకున్న పట్టుతో గెలుస్తానని భావిస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి కూడా తన వ్యక్తిగత చరిష్మా, పార్టీ వేవ్ పైనే ఆధార పడ్డారు. ఇదే నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే, సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి తన వ్యక్తిగత చరిష్మాతోపాటు పార్టీకి ఉన్న బలంతో గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు.
- మునుగోడులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి మధ్య పోరు నెలకొంది. ఉప ఎన్నికల తరువాత సీఎం ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో చేపట్టిన చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి భావిస్తుండగా, నియోజకవర్గంలో తనకున్న వ్యక్తిగత చరిష్మా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి భావిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సంప్రదాయ ఓట్లతోపాటు ఆయన చీల్చే ఇతర ఓట్లే ఈ ఎన్నికల్లో అక్కడ ప్రధానం కాబోతున్నాయి.
- దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్ మధ్య ప్రధాన పోటీ ఉండగా, బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలూ నాయక్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఆయన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

యాదాద్రిలో ముక్కోణం

- భువనగిరి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. భువనగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ నుంచి కుంభం అనిల్ కుమార్‌రెడ్డి తమ పార్టీకి ఉన్న వేవ్ పైనే ఆశ పెట్టుకున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతూ గెలుపొందాలని భావిస్తున్నారు.
- ఆలేరు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గత పదేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను మూడోసారి గెలిపి స్తాయన్న నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య.. పార్టీ జోష్, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ కూడా ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.

రెండు చోట్ల ద్విముఖం.. మరో రెండు చోట్ల త్రిముఖం

- సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. సూర్యాపేటను జిల్లాగా తీర్చిదిద్దడం, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను గెలిపిస్తాయన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా గతంలో పనిచేసిన తీరు, గత ఎన్నికల్లో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఈసారి గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు తనను గెలిపిస్తాయని భావిస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థి జానయ్య యాదవ్ పోటీలో ఉన్నా ఎంతమేరకు బీఆర్‌ఎస్ ఓట్లను చీల్చుతారన్నది ఆసక్తిగా మారింది.
- హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉన్న వ్యక్తిగత చరిష్మా, పార్టీ జోష్ తనను గెలిపిస్తుందని భావిస్తుండగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.
- కోదాడలోనూ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి గతంలో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీ జోష్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉన్న చరిష్మా తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పూర్తిగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకున్నారు.
- తుంగతుర్తిలోనూ త్రిముఖ పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మందుల సామేల్ తనకున్న పేరు, పార్టీ క్రేజ్ తనను గెలిపిస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్ర పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.



interview

'ఇప్పటికే రెండు సార్లు శాసన సభకు ఎన్నికయ్యాను. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.6,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశాను. గోదావరి జలాలతో బీడు భూములన్నీ సాగులోకి తెచ్చాను. ఇప్పుడు కూడా బరిలో నిలిచా. ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంది. నాకు హ్యాట్రిక్ విజయం ఖాయం. చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నా విజయానికి దోహదం చేస్తాయి' అని తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- తిరుమలగిరి (తుంగతుర్తి)

హ్యాట్రిక్ విజయం ఖాయం

రూ.6,500 కోట్లతో అభివృద్ధి

- గోదావరి జలాలతో నియోజకవర్గం సస్యశ్యామలం
- ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి
- ప్రభుత్వ పథకాలే విజయానికి దోహదం
- ప్రజలు మా వైపే ఉన్నారు
- కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు వచ్చి ఆ తర్వాత కన్పించరు
- వారికి ఓట్లు అడిగే అర్హత లేదు

తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్

రాజకీయాలలో పోటీ సర్వ సాధారణం. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తుంగతుర్తి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశాను. అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాను. చేసిన పనులే ఎన్నికల ప్రచార అస్త్రంగా మా పార్టీ మేనిఫెస్టోతో ముందుకు వెళుతున్నాం. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మంగళహారతులు ఇచ్చి బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సారి కూడా బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేసి ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో నమ్మకం కలిగింది. కొత్తవి కూడా అమలు చేయనున్నట్లు సీఎం చేసిన ప్రకటనపై ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.

తెలంగాణ ఉద్యమంలో నాపై కేసులు నమోదయ్యాయి

తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ప్రత్యక్షంగా పాల్గొన్నాను. ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న సమయంలో నాపై వందలాది కేసులు నమోదయ్యాయి. దీంతో పలుమార్లు జైలుకు వెళ్లాను. విద్యార్థులు చట్ట సభల్లో ఉండాలనే నిర్ణయంతో కేసీఆర్ అండదండలతో 2014లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాకు అవకాశం దక్కింది. 2014, 2018లో రెండు సార్లు ప్రజల ఆశీస్సులతో విజయం సాధించాను. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నా. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటమి భయంతో దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు నియోజకవర్గంలో ఓట్లు అడిగే హక్కు లేదు. ఆ పార్టీ నాయకులు కేవలం ఎన్నికల ముందు మాత్రమే వచ్చి ఆ తర్వాత కనిపించకుండా పోతారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూడవసారి విజయం సాధిస్తా.

సమృద్ధిగా పంటలు

నియోజకవర్గంలో 2014కు పూర్వం సరైన నీటి వనరులు లేక ప్రజలు సాగు, తాగు నీటికి ఇబ్బందులు పడేవారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు పుష్కలంగా రావడంతో నియోజకర్గం సస్యశ్యామలమైంది. ఆరు మండలాల్లో లక్ష ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి. మిషన్ కాకతీయ పథకం ద్వారా 450 చెరువులు అభివృద్ధి చెందాయి. రూ.50 కోట్లతో ఆరు చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల సమృద్ధిగా నీళ్లు అందుతున్నాయి. ఒకప్పుడు నెర్రెలు బారిన నేలలు నేడు రెండు పంటలకు నీళ్లు అందించడంతో 1,40,592 ఎకరాల్లో 3,93,657 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నది. మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగు నీటి సమస్య తప్పింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వేలాది మందికి అందాయి. దళిత బంధు పథకం కింద తిరుమలగిరి మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. దీంతో ఈ మండలంలో 2,223 మంది కుటుంబాలకు లబ్ధి చేకూరింది. వీటితో కలుపుకుంటే తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,407 దళిత కుటుంబాలకు ప్రయోజనం కలిగింది. తుంగతుర్తిలో రూ.44 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నాం.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాను. పెండింగ్‌లో ఉన్నవి ఈ సారి పూర్తి చేస్తాను. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తా. వెలుగుపల్లిలోని రుద్రమదేవి, వెంపటి చెరువులను రిజర్వాయర్‌గా మారుస్తా. కొన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మైనర్ పనులు ఉన్నాయి. ఈ పనులన్నీ ఈసారి పూర్తి చేస్తా. వారంలో ఐదు రోజుల పాటు తిరుమలగిరిలోనే ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా. మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరుతున్నా.

ప్రలోభాలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల్లో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా అడ్డుకుంటామని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి అభ్యర్థులు తమ ప్రచారం బంద్ చేయాలన్నారు. పోలింగ్ సమయం వరకు ఇంటింటి ప్రచారాలు, సోషల్ మీడియా ప్రచారాలు చేసినా, మెసెజ్‌లు పెట్టినా చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 95 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని మిగతా స్లిప్పులు ఇస్తామన్నారు. 29న ఉదయం మూడవ విడత ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. ప్రతి నియోజక వర్గంలో మూడు టీంలు ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించడానికి ఉపయోగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 640 పోలింగ్ కేంద్రాలతో పాటు 229 చోట్ల పోలింగ్ కేంద్రాల బయట వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ ముగిసాక ఈవీఎంల తరలింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. జిల్లాలో వికలాంగులు, వృద్ధుల ఓట్లు 1008 ఉండగా ఇప్పటి వరకు 92.5 శాతం పోలింగ్ పూర్తయిందన్నారు. ఈ పోస్టల్ ఓట్లను 29న కౌంటింగ్ హాల్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించాలి

కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అలాగే మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డి, నియోజకవర్గాల ఆర్‌ఓలు వీరబ్రహ్మచారి, సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

3,500 మంది అదనపు సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసులతో పాటు 3,500 మంది కేంద్ర, ఇతర రాష్ట్రాల పోలీసులు జిల్లాకు వచ్చారని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఇప్పటి వరకు 4వేల మందిని బైండోవర్ చేశామని, 460 మందికి వారెంట్ ఇచ్చినట్లు చెప్పారు. 155 తుపాకులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నుంచి ఇప్పటి వరకు 3 క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హుజూర్‌నగర్ : ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు ఎస్పీ, ఎన్నికల నోడల్ అధికారి మేక నాగేశ్వరరావు హెచ్చరించారు. 30వ తేదీన పోలింగ్ నేపథ్యంలో సోమవారం హుజూర్‌నగర్‌లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ఇందిరా సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ఈ కవాతు సాగింది. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు. అదేవిధంగా చింతలపాలెం మండలం గుడిమల్కాపురంలో ఎస్ఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్, కార్డన్‌సెర్చ్ నిర్వహించారు.

కాంగ్రెస్ దొంగ నాటకాలను గుర్తించాలి

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ఆత్మకూరు (ఎస్)లో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీ రైతుబంధు నిధుల విడుదలను ఆపిందని, ఆ పార్టీ దొంగ నాటకాలను గుర్తించాలని మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు, ఏపూర్, ఏనుబాములలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో కూడా నేటికీ కరెంట్ ఇచ్చేది ఆరు గంటలేనని, పెన్షన్ రూ.500 మాత్రమేనన్నారు. మాట తప్పిన చరిత్ర తనకు లేదని, ప్రజల కోసం రాజీ పడకుండా ప్రాణం పోయేవరకు పని చేస్తానన్నారు. మళ్లీ ఆశీర్వదిస్తే సూర్యాపేటకు డ్రైపోర్ట్, ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ పరిశ్రమ విస్తరించి 20 వేల మందికి పైగా యువతకు ఉపాధి కల్పిస్తానని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి

పెన్‌పహాడ్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. సోమవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మాచారం, చీదెళ్ల, గాజులమల్కాపురంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పర్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎప్పుడూ పట్టించుకోలేదని, అధికార పీఠం కోసం తన్నులాడటమే కాంగ్రెస్ నైజమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య, ఎంపీటీసీ ఊరుకొండ జానకమ్మ, తూముల ఇంద్రసేనారావు, సోమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్‌కు బృందా కారత్ రాక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరుతూ హుజూర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించే రోడ్డు షోకు సీపీఎం కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ రానున్నారు. ఈమేరకు ఆ పార్టీ నాయకులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

● సినీ నిర్మాత బండ్ల గణేష్


మాట్లాడుతున్న బండ్లగణేష్, చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని సినీ నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. సీఎం కేసీఆర్ గోదావరి నదిపై కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కాస్తా కూలేశ్వరం అయ్యిందనీ, మరో నాలుగు రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కూలిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. సోమవారం రాత్రి ఆయన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం యాతవాకిల్లలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. ప్రజలంతా అభివృద్ధి ప్రేమికుడైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలు మరోసారి నమ్మి మోస పోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళా కబడ్డీ జట్టు ఎంపిక


ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారిణులు

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక చేశారు. 60 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిలో పి.కృష్ణవేణి, టి.శృతి, జి.శ్రీజ, ఎస్.గోపిచంద్రిక, ఆర్.రాధా, కె.మాధవి, తేజశ్రీ, సీహెచ్.సంధ్య, జి.నవ్య, కె.అనూష, ఎం.అనూష, కె.సమీరా, చైతన్యలు ఉన్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, నామా నర్సింహరావు, సీనియర్ జాతీయ క్రీడాకారులు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పీఈటీలు మల్లేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, యాకన్న, రాములు, సునీల్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఆలిండియా జమాత్ ఉల్మా మద్దతు

నల్లగొండ: ఆలిండియా జమాత్ ఉల్మా నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పీసీసీ స్పోక్స్‌మెన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ హఫీజ్‌ఖాన్, బషీరుద్దీన్, అమీన్ బాబా, పీసీసీ సభ్యులు ఇంతియాజ్, మహ్మద్ మసూద్ అలీ, ఖాజా మెయినుద్దీన్, జహీర్ అలీఖాన్‌లు తెలిపారు. సోమవారం నల్లగొండలోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నికల సిబ్బందికి 331 బస్సులు

● ఆరు డిపోల నుంచి బస్సుల ఏర్పాటు

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ టౌన్: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం ఎన్నికల అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 331 ఆర్టీసీ బస్సులను సమకూర్చారు. మధ్యలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే మరో బస్సును అందుబాటులో ఉంచేలా అదనంగా మరో 10 బస్సులను సిద్ధంగా ఉంచారు. పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఎస్కార్ట్ ఉంటుంది.

జిల్లాల వారీగా బస్సుల వివరాలు..
నల్లగొండ జిల్లా నుంచి 142, సూర్యాపేట జిల్లా నుంచి 124, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 65

డిపోల వారీగా ఇలా..
నల్లగొండ డిపో నుంచి 55, మిర్యాలగూడ డిపో నుంచి 34, దేవరకొండ డిపో నుంచి 53, కోదాడ డిపో నుంచి 66, సూర్యాపేట డిపో నుంచి 58, యాదాద్రి భువనగిరి డిపో నుంచి 65 బస్సులు.



రెండు రోజులు తప్పని ఇబ్బందులు..
30వ తేదీన పోలింగ్ కావడంతో ఒక రోజు ముందుగానే పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తుండడంతో ఈ రెండు రోజులు ప్రయాణికులు కాస్త ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతాం. ఈ నెల 29, 30 తేదీల్లో ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులు అన్నీ విధాలుగా సహకరించాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, నల్లగొండ



సొంతూళ్లోనే ఓటు వేసేందుకు అవకాశం

● మునుగోడు నియోజకవర్గంలో నూతనంగా 9 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

చండూరు: మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు నూతనంగా 9 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో(పీఎస్ నం. 184), చండూరు మండలం పడమటి తాళ్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 218), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో(పీఎస్ నం. 31), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గురుకుల బాలికల పాఠశాలలో (పీఎస్ నం. 33), చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (పీఎస్ నం. 39), చౌటుప్పల్ మండలం చింతలగూడెం మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 51), నాంపల్లి మండలం షర్బానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో (పీఎస్ నం. 289), నాంపల్లి మండలం సుంకిశాల మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 295), నాంపల్లి మండలం జాన్‌తండా (పీఎస్ నం. 264)లో నూతనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.


గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్

బీసీల్లో ఐక్యత లేకనే వెనుకబడిపోయాం

● రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

హుజూర్‌నగర్: బీసీల్లో ఐక్యత లేకనే ఇన్ని రోజులు వెనుకబడిపోయామని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఏఐఎఫ్‌బీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘుకు మద్దతుగా రోడ్డు షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీసీపై ఉందన్నారు. బీసీల బతుకులు మార్చుకోవాలంటే బీసీల్లో ఒకడు అసెంబ్లీలో ఉండాలన్నారు. బీసీలు రాజకీయాలకు పనికిరారా, బీసీల్లో ఐక్యత లేదా, బీసీల్లో విద్యావంతులు లేరా, బీసీల్లో వ్యాపారస్తులు లేరా, ఎందుకు మరి మనకీ వెనుకబాటుతనం అని ఆయన ప్రశ్నించారు. ఐక్యతతో ముందుకు కదిలి బీసీ బిడ్డ రఘుకు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆయన కోరారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ, డోలు, డప్పు కళాకారుల నృత్యాలతో రోడ్డు షో నిర్వహించారు. అనంతరం ఆర్ కృష్ణయ్యతో పాటు నాయకులను గజమాలతో సత్కరించారు.


హుజూర్‌నగర్: రోడ్ షోలో అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య, చిత్రంలో అభ్యర్థి రఘు

రూ.5లక్షల నగదు పట్టివేత

యాదగిరిగుట్ట: ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టి రూ.5లక్షలు పట్టుకుని సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మణిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి తన కారులో రూ.5లక్షలు తరలిస్తున్నాడనే సమాచారంతో గాంధీనగర్‌లో తనిఖీ చేపట్టామని, ఈ తనిఖీల్లో కారులో ఉన్న నగదును గుర్తించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు.


కారులో పట్టుబడిన నగదు

ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తాం

● చెర్వుగట్టులో పూజలు చేసిన నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం
● ఆలయంలో బాండ్ పేపర్‌పై సంతకం

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేశారు. సోమవారం ఆయన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి దేవుడి సాక్షిగా సంతకం చేసి ప్రమాణం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఏఐసీసీ ఇన్‌చార్జి ఫర్యాజ్, దైద రవీందర్, చాల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నేతగాని కృష్ణ, రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జెర్రిపోతుల భారత్, సట్టు సత్తయ్య, రాదారపు భిక్షపతి, విజయలక్ష్మి, అచ్చాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


చెర్వుగట్టు దేవాలయంలో బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న వేముల వీరేశం

మంత్రి హరీశ్‌రావు వల్లే రైతు బంధు ఆగింది

● నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు రైతు బంధు విషయంలో నిబంధనలు ఉల్లంఘించి చేసిన వ్యాఖ్యల వల్లనే ఎన్నికల కమిషన్ దానిని నిలిపివేసిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలం యాతవాకిల్ల, అల్లీపురం, బాడవతండా, దొనబండతండా, జామ్లాతండా, చౌటపల్లి, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభల్లో సినీ నిర్మాత బండ్లగణేష్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. మరోవారం రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రైతుబంధు కంటే మెరుగైన రైతుభరోసాను ప్రజలకు తమ పార్టీ అందించబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఆరుగ్యారంటీ పథకాలను ప్రకటించడంతోనే బీఆర్ఎస్ బిత్తరపోయిందన్నారు. అవినీతిమయమైన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో సమాధానం చెప్పడం ఖాయమన్నారు. 10ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ జైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, వంటిపులి శ్రీను, నాగరాజు, అరుణాసైదులు, బి.బాబు, బాబునాయక్, భాస్కర్‌నాయక్, సక్రునాయక్, బాలానాయక్, ఎల్లారెడ్డి,గోవిందరెడ్డి, రాంరెడ్డి, లింగయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లి మండలం యాతవాకిల్లలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అర్వపల్లి దేవాలయంలో మందుల సామేల్ ప్రమాణం

అర్వపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో సోమవారం తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ బాండ్ పేపర్ రాసి ప్రమాణం చేశారు. టీపీసీసీ ఆదేశాల మేరకు బాండ్ పేపర్‌తో ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతర బాండ్ పేపర్‌ను చేతపట్టుకొని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, దండ వీరారెడ్డి, లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, చెంచల శ్రీనివాస్, దిర్శనపు కృష్ణమూర్తి, బైరబోయిన మహరాజు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బాండ్ పేపర్ రాసిన మందుల సామేల్

మట్టపల్లి క్షేత్రంలో కార్తీక వేడుక


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


క్యూలైన్‌లో భక్తులు బారులుదీరిన భక్తులు

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శ్రీపార్వతీరామలింగేశ్వర స్వామి దేవాలయం, యాతవాకిల్లలోగల శ్రీబసవలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మట్టపల్లి ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించారు. శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామిని, శ్రీలక్ష్మీనరసింహస్వామిని క్యూలైన్లద్వారా భక్తులు దర్శించుకున్నారు. యాతవాకిల్లలోగల పురాతన బసవలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతు బంధు ఆపిన కాంగ్రెస్‌ను ఖతం చేయాలి

● విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: రైతుబంధు ఆపిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఖతం చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతుబంధు పంపిణీ నిలిపివేయాలంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలపై సోమవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుబంధు విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు దురదృష్టకరమన్నారు. ఆ నాడు కుట్రపూరితంగా కాంగ్రెస్ ఆపితే నేడు ఎన్నికల కమిషన్ రూపంలో ఆటంకం కలిగిందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆపగలిగేది ఈ నాలుగు రోజులే అని అన్నారు. ఎన్నికల తరువాత యథావిధిగా రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి

సూర్యాపేట క్రైం: ఎన్నికల దృష్ట్యా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్, పోలీసు కంట్రోల్ రూం, సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ రూంలను ఎస్పీ రాహుల్ హెగ్డే సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మానిటరింగ్ చేసే సిబ్బంది యాక్టివ్‌గా పని చేయాలన్నారు. విధుల నిర్వహణలో డ్యూటీ పాయింట్స్‌లో ఉన్న సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. సీసీటీవీలను, వెబ్ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, స్థితిగతులను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్లు రాజేష్, మహేష్ ఉన్నారు.


కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

జోష్ నింపిన ప్రియాంక


భువనగిరిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రియాంకగాంధీ, పక్కన మాణిక్‌రావ్ ఠాక్రే, భువనగిరి అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ

బహుజన బిడ్డను గెలిపించుకోవాలి

● కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే

నల్లగొండ టూటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, రాష్ట్రంలో కూడా బీజేపీని గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి చేసుకోవచ్చని, నల్లగొండ నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకున్న బహుజన బిడ్డ మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్, గాంధీనగర్, సావర్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్, పేదలకు ఇళ్ల పథకం అమలు చేయని కేసీఆర్ మనకు అవసరమా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క కేసీఆర్ కుటుంబానికే లబ్ధి జరిగిందని, పేదలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కేంద్రం ఇస్తున్న ఇళ్లను కూడా పేదలకు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కేసీఆర్‌ది అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుటుంబ పార్టీలని, వారికి పేదల సంక్షేమం పట్టదని, అన్ని వర్గాల సంక్షేమం ఒక్క బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. బహుజన బిడ్డ మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించి నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలంటే అవినీతి రహిత ప్రభుత్వం రావాలని, అది బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, పెరికి మునికుమార్, దాసరి సాయి, చర్లపల్లి గణేష్, ఏరుకొండ హరి పాల్గొన్నారు.


నల్లగొండలో ప్రచారం చేస్తున్న శోభ కరంద్లాజే, చిత్రంలో బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

● తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి ప్రజా సంక్షేమం సాధ్యమని తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెం, ఊట్కూరు, పెర్కకొండారం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అధికార పార్టీ నేతలు తుంగతుర్తి నియోజకవర్గంలో మూసీనదిలోని ఇసుకను పూర్తిగా కొల్లగొట్టి వేలకోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి సాగనంపాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..
బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఊట్కూరు ఎంపీటీసీ యానాల లింగారెడ్డితో పాటూ పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాళ సమరంరెడ్డి, ఎన్నికల నిర్వాహణ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కుర్ర లింగయ్య, శ్రీను, పల్స సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం
తెలంగాణలో ఈసారి కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఏఐసీసీ అధికార ప్రతినిధి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియంత పాలన పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు ప్రజలు ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, యుగంధర్, ఇటికాల చిరంజీవి, మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


బండమీదిగూడెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మందుల సామేల్

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తజనం

నార్కట్‌పల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దైవ దర్శనానికి దాదాపు గంట సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. భక్తుల తాకిడి కారణంగా పోలీసులు గట్టు పైకి వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. భక్తుల కోసం నూతనంగా లడ్డూ ప్రసాదం విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

సినీ హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి పూజలు..
సినీ హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి చెర్వుగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనకు దేవాలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈఓ సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్ కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.


చెర్వుగట్టులో బారులుదీరిన భక్తులు


సినీ హాస్యనటుడిని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది